27022024-MAI-04_Layout 1 2/27/2024 2:29 AM Page 1





'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

# రెట్టింపైన గృహ వ్యయం

*__తాజాగా__ 'కుటుంబ వినియోగ వ్యయ సర్వే' నివేదికను జాతీయ శాంపిల్ సర్వే కార్యాలయం (ఎన్ఎస్ఎస్‌వో) విడుదల చేసింది. గృహ వినిమయ వ్యయం తీరుతెన్నుల్లోని మార్పులను ఈ నివేదిక వెల్లడిస్తుంది. పేదరికం హెచ్చుతగ్గులు, అసమానతల అంచనాలకు ఈ నివేదిక ఉపకరిస్తుంది. దేశ ప్రజల ఆర్థిక స్థితిగతులపై ఓ అంచనాకు వచ్చేందుకు ఈ డాటా ఎంతో అవసరం. ప్రజల ఆర్థిక పరిస్థితిపై డాటా సేకరించి, నివేదికలు విడుదల చేయడం లేదని మోదీ సర్కారుపై మొదటి నుంచి విమర్శలున్నాయి. చివరిసారిగా 2011-12లో ఈ నివేదిక విడుదలైంది. 2017లో పూర్తిస్థాయి నివేదిక రూపొందించినప్పటికీ డాటాలో లోపాలున్నాయంటూ ఆ నివేదికను కేంద్రం విడుదల చేయలేదు. ఉద్దేశపూర్వకంగానే బీజేపీ ప్రభుత్వం దాన్ని తొక్కిపెట్టిందనే ఆరోపణలున్నాయి. తాజాగా విడుదలైన సర్వే ఫలితాలతో డాటా లోటు తీరిపోయింది. పదకొండేండ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ స్థూల అంచనాలు విడుదల కావడం విశేషం. అన్ని రాష్ర్టాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని రెండున్నర లక్షల పైచిలుకు కుటుంబాలతో ఈ సర్వే జరిగింది.*

*తాజా నివేదికలో అనేక ఆసక్తికరమైన అంశాలు వెల్లడయ్యాయి. 2011-12 నుంచి 2022-23 మధ్యకాలంలో పట్టణ గృహ వినిమయ వ్యయం 33.5 శాతం, గ్రామీణ ప్రాంత గృహ వినిమయ వ్యయం 40-42 శాతం పెరిగింది. అయితే ఇందుకు వాస్తవ ఆదాయాల పెరుగుదల కన్నా ధరల పెరుగుదలే ప్రధాన కారణం. ఇక ఆదాయంలో ఇంటి ఖర్చుల శాతం స్వల్పంగా తగ్గిందని తాజా నివేదిక తెలిపింది. అంటే ఇతర అవసరాలకు ఖర్చు చేయడం పెరిగిందని దీనిద్వారా తెలుస్తున్నది. మరోవైపు ప్రభుత్వ సబ్సిడీలు కూడా పెరిగాయి. మన దేశానికి స్వాతంత్య్రం వచ్చిన ఏడు దశాబ్దాల తర్వాత కూడా ఉచిత/సబ్సిడీ ఆహారధాన్యాల పంపిణీపై ఆధారపడి ప్రజలు జీవిస్తుండటాన్ని కేంద్ర ప్రభుత్వాల వైఫల్యంగా స్పష్టం చేస్తోంది. ఈ నివేదిక ప్రకారం.. గుడ్లు, పాలు, చేపలు, మాంసం వంటి పోషకాహారాలతో పాటుగా ప్రాసెస్డ్ ఆహారం, శీతల పానీయాల వినియోగం పెరిగింది. ఇందులో మొదటిది ఆహ్వానించదగ్గదే అయినప్పటికీ రెండోది జీవనశైలి ఆరోగ్య సమస్యల పెరుగుదలకు దారితీస్తుంది. సర్వే నివేదికలో ఆరోగ్య వ్యయం పెరుగుదల కూడా ఈ విషయాన్నే నిర్ధారిస్తున్నది. దీంతో పాటుగా విద్యా వ్యయం, గృహోపకరణాల కొనుగోలు, మరమ్మతుల ఖర్చులు పెరగడం గమనార్హం. మారుతున్న జీవనశైలికి ఇది నిదర్శనం.*

*2016లో పెద్దనోట్ల రద్దు, 2017లో జీఎస్టీ అమలు దరిమిలా దశాబ్దకాలంలో గృహ వ్యయం రెండింతలకు పైగా పెరిగిపోయింది. 2017-18 నివేదికను విడుదల చేయనప్పటికీ బయటకు పొక్కిన సమాచారం ప్రకారం వినిమయం తగ్గిపోయినట్టు తెలుస్తున్నది. పూర్తిస్థాయి అంచనాల విడుదలతో పదకొండేండ్లలో చోటుచేసుకున్న పరిణామాల స్వరూపస్వభావాల అంచనాకు వీలు కలుగుతుంది. ద్రవ్య విధాన రూపకల్పనలో కీలకమైన వినిమయ ధరల సూచీ తయారీకి ఈ డాటా ఉపకరిస్తుంది. రాబోయే రోజుల్లో ఏర్పడే నూతన కేంద్ర ప్రభుత్వం ఈ నివేదికకు సంబంధించిన విశ్లేషణ కృషిని మరింత ముందుకు తీసుకుపోయి, సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న జనగణనను చేపట్టేందుకు నడుం బిగించాలి. దేశ గణాంక వ్యవస్థను బలోపేతం చేసేందుకు అది ఎంతైనా అవసరం.*

# మరో సమీక్ష కూడా అవసరం



**టంకశాల అశోక్**

లోక్‌సభ నియోజకవర్గాల వారీగా సమీక్షలు జరిపి అసెంబ్లీ వారీ సమీక్షలు సాగిస్తున్న బీఆర్ఎస్, ఆ తర్వాత మరొక సమీక్ష కూడా నిర్వహించటం అవసరం. అది, వివిధ సామాజిక వర్గాలు, వృత్తుల వారీ ప్రజలతో ప్రత్యక్ష సమీక్షలు. మొదటి రెండింటిలో పాల్గొంటున్నవారంతా బీఆర్ఎస్ పార్టీకే చెందిన నాయకులు, శ్రేణులు. ఎన్నికల ఫలితాలపై, భవిష్యత్తు సన్నద్ధతపై వీరితో సమీక్ష ఎంత ముఖ్యమో, స్వయంగా ఓటర్లు అయి జయాపజయాలను నిర్ణయించే క్షేత్రస్థాయి సాధారణ ప్రజా వర్గాలతో సమీక్షలు కూడా అంతే ముఖ్యం. అప్పుడే సమీక్షలకు లోతు, అర్థం, సమగ్రత ఏర్పడుతాయి. దిద్దుబాటు చర్యలపై పూర్తి స్పష్టత వస్తుంది.

లోగడ ఒకసారి అనుకున్నట్టు, ఎన్నికల ఫలితాలపై గాని, ఓటమిపై గాని ఒక రాజకీయ పార్టీ ఈ విధమైన పద్ధతిలో సమీక్షలు జరపటం, ఆ వివరాలను ఎప్పటికప్పుడు బయటకు వెల్లడించడం మనకు తెలిసినంతవరకు మొత్తం దేశంలోనే ఎప్పుడూ లేదు. బీఆర్ఎస్ సమీక్షల విశేషాలు పూర్తిగా తెలియరాకపోవచ్చు. మీడియా పరిమితుల దృష్ట్యా అది వీలు కాదు కూడా. కాని యథాతథంగా ఈ పద్ధతి అన్నదే మనకు గతంలో తెలియనిది. ఇది కొత్త పద్ధతే గాక కొత్త స్ఫూర్తి కూడా. రాగలకాలంలో దిద్దుబాటు చర్యలు సైతం ఒకవేళ ఇదే స్ఫూర్తితో సాగిన పక్షంలో ఫలితాలు తప్పక అందుకు తగినట్టు ఉంటాయి.



వివిధ సామాజిక వర్గాలు, వృత్తుల వారీ ప్రజల భావనలు ఏమిటో ఈ మొదటి రెండు సమీక్షలలో పార్టీ నాయకులు, శ్రేణుల ద్వారా నాయకత్వానికి కొంత తెలిసే ఉంటుంది. కానీ అది మరొకరి ద్వారా పరోక్ష రూపంలో తెలియటానికి, ప్రజల ముఖతః ప్రత్యక్షంగా తెలియటానికి తగినంత తేడా ఉంటుంది. అప్పుడు వారు బీఆర్ఎస్ పాలనతో పాటు పార్టీ మంచిని చెడును కూడా ఉన్నది ఉన్నట్టు నిర్మొహమాటంగా చెప్పగలరు. మంచిని మెచ్చటం ఎట్లా చేస్తారో చెడును అట్లానే ఎత్తిచూపుతారు. దానితో పాటు తమకు తోచిన సూచనలు ఎన్నయినా చేస్తారు. వాళ్ల అభిప్రాయాలు అన్నీ సరైనవి కాకపోవచ్చు. ఎందుకంటే, వారెంతా సామాన్య ప్రజలైనా వారికి కూడా ఆబ్జెక్టివిటీ, సబ్జెక్టివిటీ అనే రెండూ ఉంటాయి. ఆ దృష్టితో వారి అభిప్రాయాలను వడబోయవచ్చు. అదెట్లున్నా, పార్టీ శ్రేణుల పరిధిని దాటి నేరుగా ప్రజావర్గాల ఆలోచనలు తెలుసుకోవటం చాలా ఉపయోగకరమవుతుంది. ఇది మరో ప్రయోగమూ అవుతుంది. అంతే కాదు. ఒక పార్టీ ఈ విధంగా వివిధ వర్గాల సామాన్యుల అభిప్రాయాలను, సలహాలను నేరుగా వింటున్నదనే వార్తలు వారిద్వారా గ్రామాలలో, పట్టణాలలో ఇతరులకు చేరినప్పుడు, తామెప్పుడూ ఎరగని ఆ పద్ధతి, స్ఫూర్తి ప్రజలలో బీఆర్ఎస్ పట్ల సానుకూల అభిప్రాయాన్ని కలిగిస్తాయి. అందువల్ల రాగల రోజులలో కలిగే మేలు ఏమిటో ఎవరైనా ఊహించగలరు. ఇంకా చెప్పాలంటే, మొదటి రెండు సమీక్షలకు ఇది తీసిపోనిది. ఎందుకంటే, మొదటి రెండు పార్టీలకు అంతర్గతమైనవి కాగా, ఇది బాహిరమైనది, ప్రజానీకంతో ప్రత్యక్ష సంబంధం కలది.

ఇటువంటి సమీక్షల వల్ల కలిగే కీలకమైన ఉపయోగం మరొకటి ఉంది. కారణాలు ఏవైతేనేమి పార్టీకి ఏదో ఒక మేరకు దూరమైన సామాజిక, వృత్తి వర్గాలతో తిరిగి సాన్నిహిత్యానికి దారులు ఏర్పడుతాయి. ఈ సందర్భంలో కాంగ్రెస్ పార్టీ సుదీర్ఘ అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ఆ పార్టీ స్వాతంత్య్రోద్యమ కాలం నుంచి అన్ని సామాజిక వర్గాలకు, వృత్తివర్గాలకు ఉమ్మడి వేదికగా రూపొందటం తెలిసిందే. స్వాతంత్య్రం లభించిన వెనుక కాంగ్రెస్ పరిపాలన కొంతకాలం పాటు ఆయా వర్గాలన్నింటికి మేలుచేసే విధంగానే సాగింది. ఎన్నికలలో కాంగ్రెస్ పట్ల వారి స్పందనలు కూడా అందుకు తగినట్టు కన్పించాయి. ఆ తర్వాత నుంచి తేడాలు మొదలయ్యాయి. పరిపాలన వల్ల తమకు అసలు మేలు జరగటం లేదని, లేదా తగినంత జరగటం లేదని, లేదా నష్టాలు జరుగుతున్నాయని భావించిన ఆయా సాధారణ ప్రజా వర్గాలు నెమ్మదిగా కాంగ్రెస్‌కు దూరం కాసాగాయి. కొందరు ఇతర పార్టీల వైపు మళ్లగా, కొందరు తమ సొంత పార్టీలు, లేదా స్వతంత్ర సంస్థలను ఏర్పాటు చేసుకోవటం మొదలుపెట్టారు. మరి కొందరు ఇదేమీ చేయక తమ సమస్యలపై ఆందోళనలు సాగించారు.

సమస్య ఏమంటే, కాంగ్రెస్ పార్టీ ఈ పరిణామాల వల్ల నష్టపోతూ కూడా తనను తాను ఏ విధంగా సరిదిద్దుకోవాలో ఆ పని చేయలేదు. కొన్నిసార్లు అరకొరగా చేసింది. కొన్నిసార్లు అసలేమీ చేయలేదు. కొన్నిసార్లు నటనలు మాత్రం చేసింది తప్ప చిత్తశుద్ధి, శ్రద్ధ చూపలేదు. అందుకు రెండు కారణాలున్నాయి. ఒకటి, కాలం గడిచిన కొద్దీ కాంగ్రెస్‌లో స్వాతంత్య్రోద్యమ కాలం నాటి సామాజిక న్యాయస్ఫూర్తి బలహీనపడసాగింది. అభివృద్ధి లక్ష్యాలు నెరవేరక వెనుకడుగు వేసింది. రెండు, పార్టీ యంత్రాంగం, ప్రభుత్వ పాలన బలవంతులైన వర్గాల చేతిలో బందీ కావటం మొదలైంది.

**బలవంతుల ప్రాభవం గతం నుంచీ ఉండినా, అది క్రమంగా అదుపు తప్పి పెరగసాగింది. అటువంటి స్థితిలో, సాధారణ ప్రజావర్గాల ఓట్లయితే అధికారం కోసం కాంగ్రెస్‌కు తప్పనిసరి గనుక, పార్టీకి దూరమవుతున్న వర్గాల మేలు కోసం ఏదో చేసినట్టు పాప్యులిస్టు పద్ధతులలో నటించటం మినహా, వారి స్థితిగతులు తాము హామీ ఇచ్చినట్టు మౌలికంగా, లేదా గణనీయంగా మారేట్లు చేసింది ఏమీ లేదు. అనగా, దూరమవుతున్న వర్గాలను తిరిగి దగ్గరకు తెచ్చుకునేందుకు తీసుకున్న చర్యలు లేవన్న మాట.**

అది జరగకపోగా అదే అసమర్థ పాలనతో వారిని మరింత దూరం చేసుకుంటూపోయారు. అట్లా మరికొంత కాలం గడిచేసరికి మరొకవైపు పార్టీ నాయకత్వం సైతం అసమర్థంగా, బలహీనంగా తయారైంది. దానితో ఇక ఆ వర్గాలు పార్టీకి మళ్లీ దగ్గర కావటమనే ప్రసక్తి లేకుండా పోయింది. ఇది వర్తమానంలో మనం చూస్తున్న కాంగ్రెస్ పరిస్థితి.

ఈ ఉదాహరణను ఇంత వివరంగా చెప్పుకోవటం ఎందుకంటే ఇది ఏదో ఒక మేరకు ఆయా నిర్దిష్ట పరిస్థితులను బట్టి, అన్ని పార్టీలకు వర్తిస్తుంది. దానినుంచి నేర్చుకోవలసి ఉంటుంది. బీఆర్ఎస్‌కు కూడా. మొన్నటి అసెంబ్లీ ఫలితాలనే గమనించండి. తన పదేండ్ల పాలనలో కేసీఆర్ ప్రభుత్వం నిజానికి అద్భుతమైన, అపూర్వమైన, దేశంలో మరెక్కడా జరగని మంచిపనులు అనేకం చేసింది. విమర్శకులు సైతం జనాంతికంగా అంగీకరించే విషయం ఇది.

**తెలంగాణ రూపు రేఖలు గతం కన్న పలు విధాలుగా మారాయి. పైన ప్రస్తావించిన వివిధ సామాజిక వర్గాలు, వృత్తి వర్గాల జీవితాలలో గణనీయమైన మార్పులు వచ్చాయి. అయినప్పటికీ ఎన్నికల ఫలితాలు ఈ విధంగా ఎందుకున్నట్టు? విధానాలలో, ఆచరణలో ఎటువంటి లోపాల వల్ల వివిధ వర్గాలలోని తగినంత మంది పార్టీకి దూరమైనట్టు? వారిని తిరిగి దగ్గరకు తెచ్చుకునేందుకు విధానాలలో, ఆచరణలో చేసుకోవలసిన మార్పులేమిటి? పైన చెప్పుకొన్న కాంగ్రెస్ వైఫల్యాల అనుభవం నుంచి నేర్చుకోదగినదేమిటి? అన్నవి ప్రశ్నలు.**

ఇందుకు సమాధానాలు తెలుసుకునేందుకు బీఆర్ఎస్ నాయకత్వం సమీక్షల క్రమాన్ని ఆరంభించింది. అయితే ఆ క్రమంలో లోక్‌సభ నియోజకవర్గాలు, అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిని, అదేవిధంగా పార్టీ శ్రేణుల పరిధిని దాటి వివిధ ప్రజా వర్గాల పరిధిలోకి ప్రత్యక్షంగా ప్రవేశించాలి. అది ఎందుకు అవసరమో, అందువల్ల కలిగే మేలు ఏమిటో మరొకసారి చెప్పుకోనవసరం లేదు. ఇటువంటి సమీక్షల ప్రక్రియ పార్టీ జయాపజయాలతో నిమిత్తం లేకుండా రాగల కాలంలో కూడా ఒక విధానంగా మారితే అందువల్ల కలిగే మేలు మౌలికం, దీర్ఘకాలికం అవుతుంది. పార్టీకి ఇక తిరుగు ఉండదు, చేదు అనుభవాలు ఉండవు.

# కనుమరుగయ్యేది కాంగ్రెస్సే



**డాక్టర్ ఆంజనేయ గౌడ్**
98853 52242

'ఆరిపోయే దీపానికి వెలుగు ఎక్కువ' అనే సామెత రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి సరిగ్గా సరిపోతుంది. రాహుల్‌గాంధీ చేస్తున్న జోడో యాత్ర కనీసం సొంత పార్టీ నేతలను ఐక్యం చేయకపోగా, ఇండియా కూటమిలో ఎడబాటును ఎగదోసింది. జారిపోతున్న పార్టీ జాతీయ నేతలు, వదిలిపోతున్న కూటమిలోని స్నేహితులు.. కాంగ్రెస్ భవితవ్యాన్ని కండ్లకు కట్టినట్టుగా చూపెడుతున్నారు. ప్రాంతీయ పార్టీలతో పొత్తుల కోసం పడరాని పాట్లు పడుతున్నా, హస్తం పార్టీకి ప్రతికూల ఫలితాలే ఎదురవుతున్నాయి. ఎజెండా లేని రాహుల్ గాంధీ పాదయాత్ర గాలిలో బాణంలా మారి, తోపులాటలకు, తన్నులాటలకు వేదికగా మారింది.

పార్లమెంట్ ఎన్నికల ముంగిట నిలబడ్డ 'ఇండియా' కూటమికి ఏ కోణంలో చూసినా కాంగ్రెస్ అక్కరకురానిదిగానే కనిపిస్తున్నది. రాజకీయ పోరు యాత్రను విహారయాత్ర తీరున నిర్వహిస్తున్న రాహుల్‌గాంధీ దేశం మాట దేవుడెరుగు, హస్తం పార్టీ కార్యకర్తలకే విశ్వాసాన్ని ఇవ్వలేకపోతున్నారు. రాజకీయాల్లో ఉండాల్సిన వాస్తవిక దృక్పథం కొరవడి, సంస్థాగత నిర్మాణం బలహీనపడి, సైద్ధాంతిక కోణం వీడి కేవలం సరంజామా సమకూర్చే వారినే సన్నిహితులుగా చేసుకొని ఎన్నికల సమరానికి కాంగ్రెస్ కాలుదువ్వడం విడ్డూరమే కదా!. జనామోద సాధనా విద్యలో కాకలుదీరిన యోధులు, సుదీర్ఘ అనుభవం, మేధోసంపద, దేశం నలుమూలలపై లోతైన అవగాహన కలిగిన సీనియర్ నాయకుల ఉనికి నేడు పది జనపథ్‌లో నామమాత్రంగా మారింది. వారియర్లపై కాకుండా వార్ రూంలపై ఆధారపడి హస్తం పార్టీ ఓట్ల వేటకు పావులు కదుపుతున్నది. అందువల్లే బీజేపీని నిలువరించే జనామోద ఎజెండాను కూడా కనీసం చర్చగా మలచడంలో చతికిలపడుతున్నది. బీజేపీ సర్కార్ వైఫల్యాలపై ప్రభావవంతమైన ఏ ప్రజాస్వామిక పోరుకూ కాంగ్రెస్ నాయకత్వం వహించి కదిలించలేకపోయింది. ఆయా రాష్ర్టాల అసెంబ్లీ ఎన్నికలకు ఆరు నెలల ముందు హడావుడి, పార్లమెంట్ ఎన్నికలకు ఏడాది ముందు గడబిడ తప్ప, నిర్దిష్టమైన పని తీరు హస్తం పార్టీలో కాగడా పెట్టి వెతికినా కానరాదు. రైతు పోరైనా, ఈశాన్య రాష్ర్టాల రోదనైనా ఉడికిన తర్వాత తిరగవాత గంటెను పట్టుకొని ఫోజులివ్వడమేగానీ ఏ పోరునూ నడిపిందేలేదు. అందుకే అక్కరకురాని ఆరోవేలులా మారిపోయి, ప్రాంతీయ పార్టీల భుజాలపై హస్తం వేసుకొని యాత్రాయనం కొనసాగిస్తున్నది. నితీష్ వదిలించుకున్నా, దీదీ దుమ్మెత్తి పోస్తున్నా, స్టాలిన్ వెనకాముందాడుతున్నా కారణం బలహీన కాంగ్రెస్‌తో కూడి బీజేపీతో తలపడితే, ప్రమాదకర ఫలితాలు ఖాయమనే కదా?

మొదటి దశ జోడో యాత్ర హైవే పొడుగునా అర్థం లేని ప్రయాసగా మారి, ప్రజారాశుల మనోఫలకంపై ఏ ముద్ర వేయకుండానే ముగిసింది. చెరువంతా వలేసి రెండే పర్కలు పట్టినట్లు, డీకే శివకుమార్, రేవంత్‌రెడ్డి లాంటి ఇద్దరు దుడ్డు కర్రలు తప్ప ఢిల్లీ జనపథ్‌కు దొరికిందేం లేదు. రెండో దశ జోడో యాత్రకు కూడా న్యాయ్ యాత్ర అనే పేరు పెట్టి ఉత్తరాదిన ఎడారిలో ఇసుక వ్యాపారిలా ఎన్ని అవస్థలు పడ్డా కాంగ్రెస్ పార్టీని నమ్మేవారెవరు? వృద్ధి నమూనాలకు వక్రదృష్టిని కల్పించి,



అంతరాలను పెంచి, జాతి జనులను వైరుధ్యాలకు వేలాడదీసిందే కాంగ్రెస్ సర్కార్లు. ప్రతి ఊరిలో లోహియా, కర్పూరీ ఠాకూర్, అంబేద్కర్ వంటి ఆలోచనపరులుండే రాష్ర్టాలలో, నేరగాడే మళ్లీ బేరమాడేందుకు వచ్చినట్టుగా సామాజిక న్యాయం సూక్తులు వల్లిస్తే ఉత్తరాదీయులు వలలో పడిపోతారా? ప్రభుత్వ విభాగాల్లో, న్యాయవ్యవస్థలో బీసీలకు భాగస్వామ్యం నేటికీ ఎండమావిగానే ఉండటానికి కారణమే కాంగ్రెస్ కదా? పెరియార్ పోరు సలిపితేనే గాని మొదటి రాజ్యాంగ సవరణకు నాటి హస్తం పెద్దలకు చేతులే రాలేదు.

**అంబేద్కర్ నిలదీస్తేనే గాని తొలి బీసీ కమిషన్ వేయాలనిపించలేదు. 1952లో మొదటి బీసీ కమిషన్ నివేదిక సమర్పించిన తర్వాత, పార్లమెంట్ సెంట్రల్ హాల్‌కు కాకా సాహెబ్ కాలేల్కర్‌ను పిలిచి, మందలించి, ఆయనతో డిసెంట్ నోట్ రాయించి, తొలినాళ్లలోనే బడుగుల బతుకుల్లో బండరాళ్లేసింది హస్తం పార్టీ పెద్ద మనుషులే కదా! 1952 నుంచి 1993 దాకా మండల్ కమిషన్ సిఫారసులకే కాదు బీసీల ఎదుగుదలకూ, బీజేపీతో కలిసి అడుగడుగునా అడ్డుపడ్డది కాంగ్రెస్ పార్టీనే.**

1980లో మండల్ నివేదిక సమర్పిస్తే 1993 దాకా దశాబ్దానికి పైగా మెజారిటీ ప్రజల హక్కులను చెత్త బుట్టపాలు చేసిందెవరు? ఇండిపెండెంట్ ఇండియాలో దాదాపు ఐదు దశాబ్దాల పాటు పాక్షికంగానైనా అవకాశాలు దక్కకుండా, దగా చేసి అమానవీయ అంతరాల వ్యవస్థలను నిర్మించిందే కాంగ్రెస్ పార్టీ. న్యాయ్ యాత్రలో రాహుల్ మాట్లాడుతున్నవి నిజాలే కానీ, అవి గోముఖ వ్యాఘ్రమైన హస్తం పార్టీ వారసులు వల్లిస్తే, అపహాస్యం పాలవుతారేగానీ ఆకట్టుకోజాలరు. కేంద్ర సర్కార్ కొలువుల్లో, ఏ క్యాటగిరీ ఉన్నత ఉద్యోగాల్లో బీసీలు కేవలం 6.9 శాతం, బీ క్యాటగిరీ ఉద్యోగాల్లో 7.3 శాతం, చివరికి సీ క్యాటగిరీ కొలువుల్లోనూ 15.3 శాతమే. కార్యనిర్వాహక వ్యవస్థలోనే ఇలా ఉంటే న్యాయవ్యవస్థలో అయితే తక్కెడ తూకానికీ పెట్టలేని బలహీన స్థితిలోకి బీసీలను నెట్టేశారు. అంతెందుకు మండల్ కమిషన్ సిఫారసులపై పార్లమెంటులో జరిగిన చర్చలో రాజీవ్‌గాంధీ గుడ్డిగా వ్యతిరేకించిన వాస్తవం అందరికీ తెలిసిందే. అయితే ఆ మండల్ నివేదిక రూపకల్పనకు సహకరించినందుకు రాజీవ్‌గాంధీ కోపం పెంచుకొని, నెలలపాటు తనతో మాట్లాడలేదని దివంగత మాజీ కేంద్ర మంత్రి శివశంకర్ 'అదొక్కటే ముగింపు' అనే తన ఆత్మకథలో రాసుకున్నారు. అన్యాయమైన వ్యవస్థను కాంగ్రెస్సే వనంలా పెంచి, తీరా నేడు గట్టెంబడి నడుస్తూ గగ్గోలు పెడితే, బడుగులు నవ్వుకుంటారేగానీ నమ్ముతారా రాహులా?

నిండు సభలో ఫ్లయింగ్ కిస్‌లూ, కౌగిలింతలతో అభాసుపాలైనట్టే, పార్లమెంట్ వెలుపలా వివేకం లేని పరంధామయ్య ఖాళీ చేతులతో వరికోతలకు దిగినట్టుగా రాహుల్ గాంధీ రాజకీయాల్లో అవస్థలు పడుతున్నారు. దేశానికి ప్రత్యామ్నాయ పాలనా ఎజెండాను వివరించకుండా, నిర్దిష్టమైన రాజకీయ నయా దృక్పథం రూపొందించుకోకుండా, గాలిపటం ఎగరేసినట్టుగా హస్తం పార్టీ శ్రేణులను నడిపిస్తున్నారు. దాదాపు 15 లక్షల కేంద్ర సర్కారు కొలువులు భర్తీ చేయకున్నా, రూపాయి పతనమైనా, ద్రవ్యోల్బణం తరిమినా, ప్రభుత్వరంగ సంస్థలు అమ్మినా, జీఎస్టీతో జనం గుల్లయినా హస్తం పిడికిలి బిగించిందే లేదు. పోరాడే స్వభావం వదిలి, నడకను, నటనను నమ్ముకొని అధికారంలోకి రాగలమని కాంగ్రెస్ భావిస్తుండటం విడ్డూరం. ఈ విచిత్ర కార్యాచరణతోనే హస్తం పార్టీ ప్రజలకు దూరంగా, చివరికి హస్తినలోనూ లోకువైపోయింది. ఉత్తర, దక్షిణ భారతదేశమంతా తిరిగి ఎంత ఎగిరెగిరి దంచినా గిట్టుబాటు కావడం మాత్రం కాంగ్రెస్‌కు అసాధ్యం. సంస్థాగత నిర్మాణం, భావోద్వేగ ఎజెండా, నిత్య కార్యాచరణ కలిగిన కమలం పార్టీని ఎన్నికల కురుక్షేత్రంలో ఎదిరించే సామర్థ్యాన్ని కాంగ్రెస్ పార్టీ ఏనాడో కోల్పోయింది. పైగా వయోభారం, ఆరోగ్య సమస్యల వల్ల సోనియా గాంధీ నాయకత్వమే కాదు, ఖర్గే లాంటి సీనియర్లు కూడా లోక్‌సభ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించడం అసాధ్యం. ఇలా ఏ కోణంలో చూసినా ఇప్పుడు దేశంలోని బడుగులకైనా, దేశభక్తులకైనా రాజకీయ శక్తులు ప్రాంతీయ పార్టీలు మాత్రమే.

**రాజకీయాల్లో నిన్న కలిసొచ్చినట్టు నేడు కూడా కలిసివస్తుందనే లెక్కలు సరికానే కావు. అసెంబ్లీ ఎన్నికల్లో రాబట్టుకున్న ఫలితాలనే పార్లమెంట్ ఎన్నికల్లోనూ సాధించగలమని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు కలగంటే అవివేకమే అవుతుంది. ఇప్పటికే ఎన్నికల తర్వాత అరవై రోజుల్లోనే హస్తం పార్టీ అసలు నైజం తెలంగాణ మొత్తం బట్టబయలైపోయింది.**

రైతుబంధు రాక, బీమాకు దిక్కేలేక, సాగు నీటి కటకటకు పంటలెండి పల్లెలు పరేషాన్‌లో పడ్డయి. వస్తూ, పోతూ ఆటాడుతున్న కరెంటు కష్టాలు షురూ అయ్యాయి. గ్యారెంటీలు అందక, కేసీఆర్ పథకాలు పొందక ప్రజాచర్చలో 'కొత్తది' ఉత్తదేననే భావన గొల్లుమంటున్నది. అన్న మీద కోపం అమ్మ మీద చూపి, ఖాళీ తల్లెలో కన్నీళ్లు నింపుకున్నట్టుగా అందరికీ అనిపించబట్టె. ఇంత తొందరగా జనంలో భిన్నాభిప్రాయాన్ని మూటగట్టుకున్న సర్కార్ బహుశా కాంగ్రెస్ పార్టీదేనేమో! రైతుబంధు రాలేదంటే చెప్పు దెబ్బలు తింటరని రైతులను మంత్రులే బెదిరిస్తుంటే, ప్రశ్నించిన జర్నలిస్టుల ప్రాణమే తియ్యజూస్తుంటే, నోటితో పలికి నొసటితో వెక్కిరించినట్టు పదవులు ఒకే వర్గానికి వరమిస్తుంటే, దేశ్‌ముఖ్‌ల పాలన మళ్లీ వచ్చిందని ప్రజలు దిగులు చెందుతున్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ నేతలు మాత్రం 'అంబారెక్కిన మరుగుజ్జు నా అంత ఎత్తె వడున్నడని ఎగిరిపడ్డట్టుగా' ప్రవర్తిస్తున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజా తీర్పు ఒకేలా ఉండదని అనేక ఎన్నికల్లో వెల్లడైంది. రేపు లోక్‌సభ ఎన్నికల్లో సైతం తెలంగాణ విలక్షణ తీర్పును ఇవ్వడం ఖాయం. దగాపడ్డ దండులా రగులుతున్న రాష్ట్ర జనం హస్తం పార్టీకి గుణపాఠం చెప్పితీరుతారు. కృష్ణా నదీ పరీవాహక ప్రాజెక్టులను కేంద్ర సర్కార్ పర్యవేక్షణకు ఒప్పుకొన్న వాస్తవం తెలిశాక ప్రజలు మరింత స్పష్టంగా రాజకీయ నిర్ణయానికి వచ్చేశారు. జాతీయ స్థాయిలో కూడా.. ఎదగలేని కాంగ్రెస్‌ను నమ్మితే, ఎదుగూబొదుగే కాదు ఏదీ మనదిగా ఉండనివ్వరనే సత్యం అర్థమైంది. ఎదగని కాంగ్రెస్, ఎదపై ఎత్తుకోలేని బీజేపీ పార్టీలకంటే, అడుగడుగునా రాష్ట్ర హక్కుల కోసం రాజీలేని పోరు చేసే కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష. నిన్నంతా నడిపించిన గులాబీ జెండానే, రేపు కూడా తెలంగాణకు కాపలాగా నిలుస్తుందనేదే నిజం. దేశంలోని ప్రాంతీయ పార్టీలు పార్లమెంట్ ఎన్నికల తర్వాత ప్రబలశక్తిగా మారబోతున్నాయి. భూమిపుత్రుల రాజకీయ శక్తులే దేశ పాలనావ్యవస్థను శాసించనున్నాయి. జరగబోయే ఆ చారిత్రక పరిణామంలో తెలంగాణ పార్టీ కూడా శాసించే శక్తిగా వెలగాలన్నదే జనం ఆకాంక్ష.

**(వ్యాసకర్త: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్)**

# సోషల్ మీడియా దుర్వినియోగం



**సామాజిక మాధ్యమాల ద్వారా కొత్తపుంతలు తొక్కుతున్న సాంకేతికతను అనేకమంది సద్వినియోగం చేసుకుంటున్నారు. సోషల్ మీడియా వేదికగా వ్యాపారాభివృద్ధికి, నైపుణ్యాల పెంపునకు కృషి చేస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారు. కానీ, అసహనపు అంచులు దాటి, క్రూరత్వపు కోరలు చాచి నచ్చని వ్యక్తులను వేధించే సాధనంగా అదే సోషల్‌మీడియాను కొంతమంది మార్చుకుంటున్నారు. తత్ఫలితంగా సామాజిక మాధ్యమాలు వ్యక్తిగత హననానికి వేదికగా మారుతుండటం ఆక్షేపణీయం.**

తమ సందేశాన్ని ప్రజలకు చేరవేసేందుకు రాజకీయ పార్టీలు, నాయకులు సామాజిక మాధ్యమాలపైనే ఆధారపడటం నయా ట్రెండ్‌గా మారింది. శుష్క వాగ్దానాలు, శూన్య హస్తాలతో ప్రజలను మభ్యపెడుతూ సద్విమర్శలను సైతం సహించలేని స్థితికి పాలక, ప్రతిపక్షాలు చేరుకున్నాయి. అలాంటి వారి క్రియా శూన్యతతో నోటికి వచ్చిందల్లా మాట్లాడే వేదికగా సోషల్ మీడియా మారింది. వ్యక్తిగత కక్షలకు దేశ, రాష్ట్ర సార్వభౌమత్వాలకు ముడిపెట్టి.. వాటికి సామాజిక సమస్యల రంగు పులిమే విధ్వంసకర క'ధన' రంగంగా కొందరు సోషల్‌మీడియాను మార్చేశారు. నచ్చని వ్యక్తి మానసిక స్థైర్యాన్ని, ధైర్యాన్ని, వారి సచ్ఛీలతను, నైతిక విలువలను దిగజార్చే వినాశనకరమైన ఈ ఆలోచనలు అణుబాంబుల కంటే ప్రమాదకరం.

ఏదో ఒక పార్టీకి వత్తాసు పలుకుతూ ప్రశ్నించే జర్నలిస్టులు, సమాధానం చెప్పలేక దాడి చేసే పలు పార్టీల కార్యకర్తలు గుర్తింపు కోసం తహతహలాడుతున్నారు. వారంతా భావప్రకటనా స్వేచ్ఛ పేరిట అసభ్య పదజాలంతో విరుచుకుపడుతూ పైశాచికానందం పొందుతున్నారు. అలాంటి వ్యక్తులను, వ్యవస్థలను కట్టడి చేసే పటిష్ఠమైన పాలనా యంత్రాంగంతో పాటు ధైర్యంగా ఎదిరించే సమాజం లేకపోవడం మన దురదృష్టం.

సమాజంలో గౌరవంగా బతికే హక్కు ప్రతీ పౌరునికి ఉన్నది. కులమతాలు, పార్టీలకతీతంగా ఈ హక్కులు వర్తిస్తాయి. ఇతరులను, సంస్థలను, పార్టీలను కించపరిచే హక్కు ఎవరికీ లేదు. అయితే సోషల్ మీడియా వేదికగా తమ మాటలు, పాటలు, రచనల ద్వారా ఇతరులను హింసిస్తున్నవారు పెచ్చరిల్లుతున్నారు. కొంతమంది విషయాల ముసుగులో విషం చిమ్ముతున్నారు. ఆశయాల ముసుగులో అశ్లీలతను పెంచిపోషిస్తున్నారు. ఆధిపత్యం ముసుగులో అహంకారం ప్రదర్శిస్తున్నారు. భావప్రకటనా స్వేచ్ఛ ముసుగు వేసుకుని హననకాండ సాగిస్తున్నవారు ఇకనైనా ఆ పద్ధతి మానుకోవాలి. అలాంటివారిని, అటువంటి వ్యక్తులను ప్రోత్సహిస్తున్న వారిని ఈ సమాజం దూరంగా పెట్టినరోజే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది.

**- జోస్యుల వేణుగోపాల్**, 94404 36806

# ఎన్నికల బాండ్లు.. బడా కుంభకోణం



*మన దేశంలోని ఎన్నికల వ్యవస్థపై రాజకీయ పార్టీల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. తద్వారా ప్రజలు కోరుకున్న తీర్పును పొందలేరు. అందుకు నిదర్శనమే ఎన్నికల బాండ్లు. అది ఓ కుంభకోణం. దాన్ని రద్దు చేస్తూ సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పును వెలువరించడాన్ని స్వాగతిస్తున్నా. ఇకనైనా ఎన్నికలు నిష్పక్షపాతంగా జరుగుతాయనుకుంటున్నా.*

**- అమర్త్యసేన్,** *నోబెల్ పురస్కార గ్రహీత*